RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ శనివారం 17.01.2026 సంపుటి : 03 సంచిక : 46 పేజీలు : 08 వెల: రూ.5

Karimnagar Saturday 17.01.2026 Volume: 03 Issue 46 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## స్పీకర్‌కు ఇదే చివరి అవకాశం..

ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు ఆగ్రహం



5

# ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తాం

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నాం. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. ఆదిలాబాద్‌లో పరిశ్రమల అభివృద్ధికి 10వేల ఎకరాల భూసేకరణ జరుపుతాం. పరిశ్రమలు వస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఎన్నికలప్పుడే రాజకీయాలు.. ఎన్నికలు ముగిసిన తర్వాత అభివృద్ధికి కలిసి పనిచేద్దాం.



## ఆదిలాబాద్‌కు సీఎం వరాల జల్లు

## పాలమూరుకు సమానంగా అభివృద్ధి

## ఎన్నికలప్పుడే రాజకీయాలు

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ
- నాగోబా జాతరకు నిధులు మంజూరు చేస్తాం
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నాం
- ప్రధాని మోదీ చేతులమీదుగా ప్రారంభిస్తాం
- పరిశ్రమల అభివృద్ధికి 10వేల ఎకరాల భూసేకరణ
- పరిశ్రమలు వస్తేనే అభివృద్ధి సాధ్యం
- తరచూ ప్రధానిని కలవడంపై తప్పుడు ప్రచారం
- రాష్ట్ర అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా
- 2038వరకు అధికారంలో ఉంటాం : సీఎం ధీమా

ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యానించారు. అత్యంత వెనుకబడిన ఈ జిల్లాకు ఆశించిన న్యాయం జరగలేదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శుక్రవారం సీఎం పర్యటించిన ఆయన.. రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

5లో..

## నేడు,రేపు బెంగాల్‌లో మోదీ పర్యటన



కోల్‌కతా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు,రేపు తేదీల్లో పశ్చిమ బెంగాల్‌లో పర్యటించనున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు రాజకీయ ర్యాలీల్లోనూ పాల్గొం టారు. ఎన్నికల జాబితా ఎస్‌ఐఆర్ ప్రక్రియ, టీఎంసీ రాజకీయ కన్సల్టెన్సీ ఐ-ప్యాక్‌పై ఇటీవల జరిగిన ఈడీ దాడులతో బెంగాల్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కిన నేపథ్యంలో మోదీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకోనుంది. షెడ్యూల్ ప్రకారం.. మైనారిటీల ఆధిపత్యం ఉన్న మాల్డాలో నేడు జరిగే బహిరంగ ర్యాలీలో మోదీ పాల్గొంటారు. సింగూర్‌లో జరిగే మరో ర్యాలీకి కూడా హాజరవుతారు. శనివారం సాయంత్రం మాల్డాకు ప్రధాని చేరుకుంటారని, తొలుత ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని ఆ తర్వాత సమీప గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసే పబ్లిక్ ర్యాలీలో పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర నేత ఒకరు తెలిపారు. ఆదివారం నాడు మరలా బెంగాల్ వచ్చి హుగ్లీలోని సింగూర్‌లో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని, ఆ వెంటనే పబ్లిక్ ర్యాలీకి హాజరవుతారని చెప్పారు.

## ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసు.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన టీజీ బీజేపీ



ఢిల్లీ, జనవరి16 : తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసు మరో కీలక దశకు చేరుకుంది. పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ తెలంగాణ బీజేపీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సుప్రీం న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేదని పేర్కొంటూ.. తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను తెలంగాణ బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేశారు. ఈ విషయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది.

## పోలీసులను ఆశ్రయించిన అనసూయ



ప్రముఖ నటి, టీవీ యాంకర్ అనసూయ భరద్వాజ్ సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడం సినీ, సోషల్ మీడియా వర్గాల్లో సంచలనంగా మారింది. సోషల్ మీడియా లో తనపై జరుగుతున్న ట్రోలింగ్, వ్యక్తిత్వ హననం, అభ్యంతరకర పోస్టులు చేస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు.

6

## గాదె ఇన్నయ్యకు 48 గంటల బెయిల్



యూపీఏ చట్టం కింద ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేసిన సామాజిక కార్యకర్త గాదె ఇన్న య్యకు కోర్టు బెయిల్ మం జూరు చేసింది. శుక్రవారం ఆయనకు షరతులతో కూడి న 48 గంటల తాత్కాలిక బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది.

6

# ఉచిత విద్యుత్‌ను వినియోగించుకోవాలి

●లబ్ధిదారులకు గృహజ్యోతి పత్రాల పంపిణీ

●సర్పంచ్ బోడ సోములు



జనోదయ,మరిపెడ , జనవరి 16 :

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ఉచిత విద్యుత్తును ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని అబ్బాయి పాలెం గ్రామ సర్పంచ్ బోడ సోములు అన్నారు. అబ్బాయి పాలెం గ్రామంలో గృహ జ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్తు ఉపయోగించుకున్న వినియోగదారులకు సబ్సిడీ పత్రాలను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల అనుసారం మేరకు, ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్కు 82 లక్షల 62 వేల 498 మంది కుటుంబాలు గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్తును వినియోగం పొందుతున్నట్లు తెలిపారు. వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం రూ:3,593 కోట్ల రూపాయలను సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిందన్నారు. దీనివల్ల ఎంతోమంది పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు కరెంటు బిల్లులు కట్టలేకుండా అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితుల్లో ఉన్నాయన్నారు.వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం నేరుగా డబ్బులు చెల్లించి లబ్ధిదారులకు సబ్సిడీని వర్తింపజేసినట్లు సోములు వివరించారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎస్.కె షరీఫ్, కారోబార్ అలవాల యాదగిరి, వివో అధ్యక్షురాలు ఎస్ కె చాందిని, ఎలక్ట్రిసిటీ లైన్మెన్ భాస్కర్ పాల్గొన్నారు.

## మేడిపల్లి మండల కేంద్రంలో సీఎం కప్ ర్యాలీ



జనోదయ, జగిత్యాల, మేడిపల్లి, జనవరి 16

మేడిపల్లి మండల కేంద్రంలో సీఎం కప్ ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మకిలి దాస్ ఉపసర్పంచ్ తోపారపు అర్జున్ మండల విద్యాధికారి లక్ష్మీ నరసయ్య జిల్లా క్రీడల అధికారి రవికుమార్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పుష్పలత విశ్వప్రసాద్ ,కృష్ణ ప్రసాద్, పవన్ కుమార్ శ్యాం సుందర్, అశోక్ కుమార్,పిఈటిలు గ్రామ ప్రజలు యువతి యువకులు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భారతదేశ ఒలంపిక్‌లో మెడల్స్ సాధించాలంటే గ్రామస్థాయి నుంచి పిల్లల్ని ప్రోత్సహించాలని గ్రామస్థాయిలో క్రీడాభివృద్ధి జరగాలన్నారు.

# ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

●70 కోట్లతో

కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధి

●మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

జనోదయ, హనుమకొండ

రాష్ట్రంలో అన్ని ఆలయాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంత్రి రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వార్లను దర్శించుకున్నారు. అంతకుముందు త్రిశూలం కూడలిని మంత్రులు ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ప్రతి జనవరి నెలలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా అత్యంత వైభవంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరుగుతుంటాయని పేర్కొన్నారు. లక్షలాదిమంది భక్తులు శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామిని దర్శించుకుంటారని తెలిపారు. స్వామి వారి కళ్యాణం, కుంకుమార్చన, కోడేలు కట్టడం, అగ్నిగుండం, బండ్లు తిరిగే కార్యక్రమం జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయని అన్నారు. సంతానం లేని వారు కోరమీసం స్వామివారికి సమర్పించుకుంటే సంతానం కలుగుతుందనే నమ్మకం భక్తుల్లో ఉందన్నారు. భక్తులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తారని అన్నారు. స్వామి వారిని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం వసతి సదుపాయాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు.

### భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు...

భక్తులకు ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారని తెలిపారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. భక్తులు మొక్కులు చెల్లించుకుని క్షేమంగా వచ్చి ఇంటికి వెళ్లేలా సౌకర్యాలు ఉండే విధంగా అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. దర్శనం నిమిత్తం మూడు లైన్లు ఉండే విధంగా అధికారులను ఆదేశించామని, మహిళలు, చిన్నపిల్లల తల్లులు, వృద్ధులు, దివ్యాంగులకు, అదే విధంగా విఐపి, సాధారణ దర్శనాలకు దారులు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జాతరను ప్లాస్టిక్ రహితంగా కూడా చేయాలని తెలియజేశామన్నారు. భద్రకాళి అమ్మ వారు అంటేనే ఉగ్ర స్వరూపిణి అని పేర్కొన్నారు. ఉగ్ర స్వరూపిణి అయిన భద్రకాళి అమ్మవారి సమేతంగా శ్రీ వీరభద్ర స్వామి ఇక్కడ కొలువుదీరి ఉన్నారని పేర్కొన్నారు.

### 70 కోట్లతో ఆలయ అభివృద్ధి...



కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధి కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ రూ. 70 కోట్లను ఇవ్వాలని ప్రతిపాదనలు ఇచ్చారని, మాస్టర్ ప్లాన్, అన్ని అనుమతులకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో వచ్చే బడ్జెట్లో నిధులను కేటాయించి ఆలయ అభివృద్ధి పనులను చేపడతామన్నారు. భద్రకాళి నుండి బాసర వరకు ఆలయాలను అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక సబ్ కమిటీని వేయమని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుకు తెలిపారని అన్నారు. భద్రకాళి దేవాలయ మాడవీధుల నిర్మాణ పనులు, వేములవాడ మాడవీధుల నిర్మాణ పనులు సాగుతున్నాయని చెప్పారు. సమ్మక్క సారలమ్మ ఆలయ పునరుద్ధరణ పనులు నభూతో నభవిష్యత్తు అన్న విధంగా ఉన్నాయని అన్నారు. మేడారంలో సమ్మక్క సారక్క గిరిజన జాతర జరగబోతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఆలయాలకు సందర్శకులు ఎక్కువగా రావాలని, ద్వారా రెవెన్యూ అన్నారు. తెలంగాణ ప్రజ



లందరికీ వీరభద్ర స్వామి ఆశీస్సులు ఉండాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వీరభద్ర స్వామి ఆశీస్సులు అందజేస్తూ ముందుకు నడిపించాలని కోరుకున్నట్లు చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ...ఈ ప్రాంత ప్రజల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి కొండా సురేఖను కోరారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత, ఆలయ కార్యనిర్వాహణాధికారి కిషన్ రావు, కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సిఐ పులి రమేష్, ఎస్ఐ రాజు, ఇతర అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ధర్మపురిలో మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ పర్యవేక్షణ



**జనోదయ, జగిత్యాల ప్రతినిధి, జనవరి 16**
రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం ధర్మపురి మున్సిపల్ కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, ఓటర్లకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీ మహిళలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖతో సమన్వయం పెంచాలని తెలిపారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఓటింగ్ శాతం పెంచేందుకు ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు తావు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ హరిణి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎమ్మార్వో శ్రీనివాస్‌తో పాటు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

# జాతరకు ఏర్పాట్లు

- ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు
- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**జనోదయ : గోదావరిఖని**
గోదావరిఖని సమ్మక్క- సారాలమ్మ జాతర ఏర్పాట్ల పనులను శుక్రవారం అర్జీ 1 జియం లలిత్ కుమార్‌తో కలిసి రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక వసతులు సమకూర్చాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం సంక్రాంతి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కైట్ ఎగిరేసి పండుగ సందడిలో పాల్గొన్నారు. అనంతరం నాయకులతో, కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# వెల్ నెస్ సెంటర్‌ను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతా

- ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం
- వరంగల్ ఆకాశవాణి క్వార్టర్స్‌లో ఏర్పాటు



**జనోదయ, హనుమకొండ, జనవరి 16:**
వరంగల్ వెల్‌నెస్ సెంటర్‌ను తన ఎంపీ నిధుల ద్వారా కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తానని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.వరంగల్ నగర ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఎంపీ కావ్య ఏడాదిన్నర కాల నిరంతర కృషికి కీలక విజయం లభించింది. మొదట వరంగల్ జిల్లాలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు నాలుగు అనువైన ప్రభుత్వ కార్యాలయాలను అధికారులతో కలిసి ఎంపీ స్వయంగా పరిశీలించారు. వాటిలో వరంగల్‌లోని ఆకాశవాణి పరిధిలోని సిబ్బంది క్వార్టర్స్‌లో కొత్తగా వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.సుదీర్ఘకాలంగా అమలుకు నోచుకోని వరంగల్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కోసం పార్లమెంట్ సమావేశాల్లోనూ, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అధికారులతోనూ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య చేసిన నిరంతర సంప్రదింపులు, కృషి ఫలితంగా వెల్‌నెస్ సెంటర్ మంజూరైంది.

**వరంగల్‌కు మాత్రమే పూర్తి అనుమతులు...**

దేశవ్యాప్తంగా సుమారు 22 కేంద్రాలకు వెల్‌నెస్ సెంటర్‌లకు మంజూరు లభించగా, వరంగల్ జిల్లాకు మాత్రమే పూర్తి అనుమతులు లభించాయని ఎంపీ స్పష్టం చేశారు. వరంగల్ పరిధిలో ఉన్న 54 ప్రధాన పట్టణాల్లో నివసిస్తున్న 15 వేల మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలకు ఆరోగ్య సేవల సదుపాయాలు అందించడంలో ఈ వెల్‌నెస్ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీ తెలిపారు. వెల్‌నెస్ సెంటర్ ద్వారా వైద్య చికిత్సలు, వ్యాధి నిర్ధారణ తదితర సదుపాయాలు లభించడం వల్ల ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలకు వైద్య-ఆరోగ్య సంబంధిత సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. వరంగల్‌కు మంజూరైన వెల్‌నెస్ సెంటర్‌లో వెంటనే పనులు ప్రారంభించాలని సిజిహెచ్‌ఎస్ డైరెక్టర్ రోహిణిని ఎంపీ కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, పెన్షనర్లు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాలిపటాల పంపిణీ



**జనోదయ, మందమర్రి జనవరి 16:**
సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాలిపటాలు పంపిణీ చేశారు. పట్టణం లోని సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్ చిన్నారులకు గాలి పటాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో యువత తమ ఆలోచనలను కొత్త విధానాలకు పదును పెట్టి తమ ఉజ్వల భవిష్యత్తుకి బంగారు బాటలు వేసుకోవా లని ఆయన కోరారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పొన్నారంలో ఆకట్టుకున్న కైట్ ఫెస్టివల్



**జనోదయ,మందమర్రి జనవరి 16:**

సంక్రాంతి పర్వదినంను పురస్కరించుకుని మండలంలోని పొన్నారం గ్రామంలో నిర్వహించిన కైట్ ఫెస్టివల్ పలువురిని ఆకట్టుకుంది. గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్‌ను సర్పంచ్ పెంచాల మధు ప్రారంభించి మాట్లాడారు. సంక్రాంతి అంటేనే యువకులు, చిన్నారులు అనే తారతమ్యం లేకుండా గాలిపటాలని ఎగిరేస్తూ ఆనందంగా జరుపుకునే పండుగని అన్నారు. భారత దేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షణ కోసమే గ్రామంలో కైట్ ఫెస్టివల్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యువకులు చిన్నారులు పాల్గొన్నారు.

# ఘనంగా సంక్రాంతి

**జనోదయ, మందమర్రి జనవరి 16:**

సంక్రాంతి పర్వదినంను పురస్కరించుకొని పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం వేకువ జాము సుండే మహిళలు తమ ఇండ్ల ముందు కళ్ళాపి చల్లి రంగురంగుల రంగవల్లులతో వాకిళ్ళను అందంగా అలంకరించారు. రంగ వల్లికలో గొబ్బెమ్మలు, నవధాన్యాలతో పాటు బంతి పూలతో రంగవల్లికలు అందంగా తీర్చి దిద్దారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలు తమ ఇండ్లలో చేసిన పిండి వంటలు ఘుమఘుమలాడాయి. పండుగ సందర్భంగా పలు ఆలయాలు భక్తులతో కళకళలాడగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా చిన్నారులు, యువకులు రంగురంగుల గాలి పటాలను ఎగురవేస్తు కేరింతలు కొట్టగా, ఇండ్ల ముందు మహిళలు పోటీపడి ముగ్గులు వేశారు. మహిళలు, చిన్నారులు, యువకులు ఆనందంగా పండుగను జరుపుకున్నారు.



# దేశానికి సేవ చేసే అవకాశం గర్వకారణం

**సైనిక దినోత్సవం సందర్భంగా విశ్రాంత అవల్దార్ మెట్టు ప్రకాష్‌కు ఘన సన్మానం**



**జనోదయ, మేడిపల్లి, జనవరి 16**

సైనిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మేడిపల్లి మండల కేంద్రంలో శుక్రవారం విశ్రాంత అవల్దార్ మెట్టు ప్రకాష్‌ను ఘనంగా సన్మానించారు. ఉమ్మడి మేడిపల్లి-భీమారం రెండు మండలాల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, 17 సంవత్సరాల పాటు జమ్ము కాశ్మీర్ సరిహద్దుల్లో దేశ సేవలందించిన విశ్రాంత అవల్దార్ మెట్టు ప్రకాష్‌కు శాలువాలు కప్పి గౌరవం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ ఎదులాపురం దయాకర్ మాట్లాడుతూ, నేడు దేశ ప్రజలంతా ప్రశాంతంగా నిద్రపోతున్నారంటే, సరిహద్దుల్లో సైనికులు మంచు గడ్డలను కూడా లెక్క చేయకుండా ప్రాణాలకు తెగించి నిరంతరం కాపలా కాస్తూ దేశ రక్షణకు అంకితమై ఉండటమే కారణమని అన్నారు. దేశ భద్రతలో సైనికుల పాత్ర అమూల్యమని, వారి సేవలను ప్రతి పౌరుడు గౌరవించాలని పేర్కొన్నారు. అవల్దార్ మెట్టు ప్రకాష్ మాట్లాడుతూ, 17 సంవత్సరాల పాటు దేశానికి సేవ చేసే అవకాశం లభించడం తన జీవి తంలో గర్వకారణమని తెలిపారు. సరిహద్దుల్లో సేవలు నిర్వహించిన రోజులు మరువలేనివని, దేశ రక్షణే సైనికుడి ప్రధాన ధ్యేయమని అన్నారు. తనను సత్కరించిన ప్రెస్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ధూమాల ప్రేమ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లు మామిడి ఆంజనేయులు, నీలగిరి, సహాయ కార్యదర్శి ఎండీ రహీం, కోశాధికారి అందె అశోక్ కుమార్, గౌరవాధ్యక్షులు చింతకింది లక్ష్మీపతి, ముఖ్య సలహాదారు ఎండి రఫీతో పాటు కార్యవర్గ సభ్యులు జంగిలి గంగ నరసయ్య, పాలెపు రమేష్, దుమాల అనిల్ కుమార్, ఎలుమలపల్లి చిరంజీవి, కోటూరు వేణు, పల్లికొండ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా సాగింది.

## ధర్మ జాగరణ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**జనోదయ : మందమర్రి జనవరి 16:**

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని మహిళలకు ధర్మ జాగరణ సంస్థ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గురువారం పట్టణంలోని యాపల్ ప్రేమ్ నగర్ నవదుర్గ మండలి, ధర్మ జాగరణ సంస్థలు సంయుక్తంగా సంక్రాంతి పండగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో కాలనీ మహిళలు ఉత్సాహంగా పాల్గొనగా గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మ జాగరణ సంస్థ పట్టణ కన్వీనర్ పైడిమల్ల అరుణ్ కుమార్ మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు గొప్పవని వాటిని కాపాడు కోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆనంతరం ధర్మజాగరణ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ధర్మజాగరణ సంస్థ, నవ దుర్గ మండలి సభ్యులు కుప్పాల శ్రీనివాస్, కుప్పాల రమేష్, అద్దూరి సాంబమూర్తి, కట్టకోజ్వాల చారి, ఏఎస్ఐ వెంకన్న, వేముల సత్తయ్య, కొమ్ము రాజు, కాముని రామూర్తి, వేముల నర్సయ్య, పైడిమల్ల అమన్, చంద్రశేఖర్, కొత్తపల్లి శ్రీనివాస్, కృష్ణ బాలులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం

**మంత్రి వివేక్ వెంకటస్వామి**



**జనోదయ:మంచిర్యాల**

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, మందమర్రి మండల తహసిల్దార్ సతీష్, డి.సి.సి. అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డిలతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, చెన్నూర్ నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అనుసంధానం చేస్తూ అంతర్గత రహదారులు నిర్మించడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా మురుగు కాలువల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు పథకం ఫలాలు అందించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అమృత్ పథకంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం శుద్ధమైన త్రాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 1వ వార్డు అల్లూరినగర్‌లో 73 లక్షల 46 వేల రూపాయలు, 2వ వార్డు తిలక్‌నగర్‌లో 72 లక్షల 56 వేల రూపాయలు, 7వ వార్డులో 72 లక్షల 56 వేల రూపాయలు, 8వ వార్డు చైతన్య కాలనీలో 1 కోటి 89 లక్షల రూపాయలు, 9వ వార్డు ఆర్.ఆర్. నగర్‌లో 46 లక్షల రూపాయలు, న్యూ తిమ్మాపూర్‌లో 52 లక్షలు 50 వేల రూపాయలు, ఓల్డ్ తిమ్మాపూర్‌లో 44 లక్షల 50 వేల రూపాయలు, 12వ వార్డు గాంధీ నగర్ ప్రాంతంలో 6 లక్షలు 17 వేల రూపాయలు, 13వ వార్డు ఆమ్‌నగర్ ప్రాంతంలో 6 లక్షల 17 వేల రూపాయలు, 14వ వార్డు మల్లికార్జున నగర్ ప్రాంతంలో 27 లక్షల 22 వేల రూపాయలు, 16వ వార్డు గంగా కాలనీలో 34 లక్షల 64 వేల రూపాయల అంచనా వ్యయంతో టి.యు.ఎఫ్.ఐ.డి.సి., డి.ఎం.ఎఫ్.టి., సి.ఎస్.ఆర్., నగర అభివృద్ధి నిధులతో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో గల ప్రతి ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను ప్రణాళికబద్ధంగా వినియోగించి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వచ్చే వేసవిలో ప్రతి ఇంటికి నిరంతరం త్రాగునీటిని అందించేందుకు అమృత్ పథకం క్రింద నీటి ట్యాంకులు, ఇతర అనుబంధ పనులను చేపట్టి కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు కనీస అవసరాలను తీర్చేందుకు అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ధరలు నిర్ణయించి వేలం వేయాలి

**-బీసీ సంక్షేమ సంఘం యూత్ పట్టణ అధ్యక్షులు ముదారపు శేఖర్-**



**జనోదయ, మందమర్రి జనవరి 16:**

సమ్మక్క సారలమ్మ జాతర ధరలను నిర్ణయించిన తర్వాతనే వేలం పాటలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం పట్టణ యువత అధ్యక్షులు ముదారపు శేఖర్ సింగరేణి యజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో ఆర్కే1ఎ గని సమీపంలో జరిగే సమ్మక్క - సారలమ్మ జాతరలో విక్రయించాల్సిన వస్తువుల ధరలను ముందే నిర్ణయించాలని ఆయన కోరారు. ముఖ్యంగా పార్కింగ్ విషయంలో ఖచ్చితమైన ధరలను నిర్ణయించిన తర్వాతనే వేలం పాటలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం ధరలు నిర్ణయించక పోవడంతో వేలం పాట దక్కించుకున్న వారు అధిక ఛార్జీలు వసూలు చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారని, గతంలో వేలం పాట దక్కించుకున్న వారు ఇష్టారీతిన పార్కింగ్ ధరలు వసూలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత అనుభవాల దృష్ట్యా ఈ సారి ముందే ధరలను నిర్ణయించిన అనంతరం వేలం పాట నిర్వహించి ప్రజల ఇబ్బందులు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు మొగిలిచర్ల రాజేష్, అనిల్, దీపక్, శ్రావణ్, అజయ్, అనిల్, శ్రేయస్‌లు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తాం

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నాం. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. ఆదిలాబాద్‌లో పరిశ్రమల అభివృద్ధికి 10వేల ఎకరాల భూసేకరణ జరుపుతాం. పరిశ్రమలు వస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఎన్నికలప్పుడే రాజకీయాలు.. ఎన్నికలు ముగిసిన తర్వాత అభివృద్ధికి కలిసి పనిచేద్దాం.



## ఆదిలాబాద్‌కు సీఎం వరాల జల్లు

## ఎన్నికలప్పుడే రాజకీయాలు

## పాలమూరుకు సమానంగా అభివృద్ధి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ
- నాగోబా జాతరకు నిధులు మంజూరు చేస్తాం
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నాం
- ప్రధాని మోదీ చేతులమీదుగా ప్రారంభిస్తాం
- పరిశ్రమల అభివృద్ధికి 10వేల ఎకరాల భూసేకరణ
- పరిశ్రమలు వస్తేనే అభివృద్ధి సాధ్యం
- తరచూ ప్రధానిని కలవడంపై తప్పుడు ప్రచారం
- రాష్ట్ర అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా
- 2038వరకు అధికారంలో ఉంటాం : సీఎం ధీమా

**ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యానించారు. అత్యంత వెనుకబడిన ఈ జిల్లాకు ఆశించిన న్యాయం జరగలేదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శక్రవారం సీఎం పర్యటించిన ఆయన.. రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.**

**ఆదిలాబాద్, జనవరి16 :** ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యానించారు. అత్యంత వెనుకబడిన ఈ జిల్లాకు ఆశించిన న్యాయం జరగలేదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శక్రవారం సీఎం పర్యటించిన ఆయన.. రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హాతి ఘాట్‌లో చనాకా – కొరాట బ్యారేజ్ పంప్‌హౌస్ ప్రారంభించారు. సదర్మట్ బ్యారేజ్‌ను జాతికి అంకితం చేశారు. యాసంగి పంటకు నీరు విడుదల చేశారు. పొన్కల్ దగ్గర గోదావరి నదిపై సదర్మట్ బ్యారేజ్ నిర్మాణాన్ని ప్రారంభించారు. రూ.676 కోట్లతో ప్రభుత్వం సదర్మట్ బ్యారేజ్ నిర్మాణం చేపట్టిందని సీఎం ప్రసంగించారు. ఈ బ్యారేజ్ ద్వారా 18 వేల ఎకరాలకు సాగునీరును ప్రభుత్వం అందించనుందన్నారు. పోరాటం, పౌరుషాల గడ్డ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సరైన న్యాయం జరగలేదన్నారు. పాలమూరుతో సమానంగా ఆదిలాబాద్ అభివృద్ధి చేస్తామని వివరించారు. ఆదిలాబాద్‌కు కావాల్సిన నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో చిత్తశుద్ధిగా పనిచేసి ఉంటే చనాక – కొరాట ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేదని తెలిపారు. పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ అభివృద్ధికి నిధులు ఇస్తామని స్పష్టం చేశారు. చనాక – కొరాట, సదర్మట్ బ్యారేజీలు గత పదేళ్లలో పూర్తికాలేదని ఈ సందర్భంగా సీఎం చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశామని వెల్లడించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ ఇవ్వాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. బాసర ట్రిపుల్ ఐటీలోనే యూనివర్సిటీని ప్రారంభిస్తామన్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఆదిలాబాద్ యూనివర్సిటీని తానే ప్రారంభిస్తానని రేవంత్ చెప్పుకొచ్చారు. కాళేశ్వరానికి రూ.లక్షా 10 వేల కోట్లు ఖర్చుచేసినా.. చుక్కనీరు రాలేదని విమర్శించారు. రైతులకు నీరు రావాలంటే తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. నాగోబా జాతరకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రూ.300 కోట్లతో మేడారం ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు సీఎం రేవంత్.

### అందుకే మోదీని కలుస్తున్నా..

'ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నాం. ప్రధాని మోదీ చేతులమీదుగా ప్రారంభిస్తాం. ఆదిలాబాద్‌లో పరిశ్రమల అభివృద్ధికి 10 వేల ఎకరాల భూసేకరణ జరుపుతాం. పరిశ్రమలు వస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఎన్నికలప్పుడే రాజకీయాలు.. ఎన్నికలు ముగిసిన తర్వాత అభివృద్ధికి కలిసి పనిచేద్దాం. అందుకే ప్రతి మూడు నెలలకోసారి ప్రధానిని, కేంద్ర మంత్రులను కలుస్తున్నాం. బీజేపీ ప్రజా ప్రతినిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువస్తే పరిష్కరిస్తాం. నేను తరచూ ప్రధానిని కలవడంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నాకు నరేంద్ర మోదీతో బంధుత్వం లేదు.. చుట్టమూ కాదు. ఆయన మనకు ప్రధాని.. ఆయనతో పనులు చేయించుకుంటున్నాం. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా, పైరవీల కోసం పోవడం లేదు, పర్సనల్ ఎజెండా ఏమీ లేదు. ఎవరిని కలిసినా అభివృద్ధి కోసమే. కేంద్రం సహకారంతోనే అవసరమైన ఎయిర్ పోర్టులు, నిధులు వస్తున్నాయి. నాటి పాలకులు చేసిన అప్పులే ఇప్పుడు ఉరి తాడు అయ్యాయి. మేం ఫ్యూచర్ సిటీ అంటే మమ్మల్ని రియల్ ఎస్టేట్ బ్రోకర్స్ అంటున్నారు' అని ప్రతిపక్షాలనుద్దేశించి అన్నారు ముఖ్యమంత్రి. 'పదేళ్ల పాలనలో ఏమీచేయని వ్యక్తి ప్రజాపాలనను భరించలేకపోతున్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఉన్న వ్యక్తి ఇలాగేనా మాట్లాడేది. చేతనైతే మమ్మల్ని ఆశీర్వదించండి.. లేకుంటే ఫామ్ హౌస్‌లోనే ఉండండి. మారీచుడు, సుగ్రీవుడు తరహాలో రాక్షసుల్లా.. అభివృద్ధికి అడ్డుపడుతున్నారు. శుక్రాచార్యుడిలా ఫామ్‌హౌస్‌లో ఉన్న వ్యక్తి ప్రోత్సహిస్తున్నారు. పదేళ్లు అధికారంలో ఉండి రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారు. బీఆర్ఎస్ నేతలకు అభివృద్ధి అంటే ఇష్టం లేకపోతే ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకోవచ్చు. బావాబామ్మర్దులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మొన్న పంచాయతీ ఎన్నికల్లో 66శాతం కాంగ్రెస్ సర్పంచ్‌లను గెలిపించారు ప్రజలు. వారి నమ్మకాన్ని వమ్ము చేయం. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ మంచి వాళ్లను ఎన్నుకోండి. సమస్యలను పరిష్కరించే వాళ్లను, ప్రజా ప్రభుత్వంతో కలిసి పనిచేసిన వాళ్లనే గెలిపించుకోండి. నేను ఓడిపోయిన వాళ్ల గురించి మాట్లాడను. మేం పాలకులం కాదు.. సేవకులం. మీ మనసు గెలుస్తాం.. రాబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తాం. 2038వరకు అధికారంలో ఉంటాం' అని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## స్పీకర్‌కు ఇదే చివరి అవకాశం..

### ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు ఆగ్రహం

ఎమ్మెల్యేల అనర్హత వేటుపై తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో అఫిడవిట్ ఇవ్వాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై శుక్రవారం విచారణ జరిపిన ధర్మాసనం.. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై విచారణ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ తరఫున అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపించారు. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ నిర్ణయం ప్రకటించారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. స్పీకర్ కంటి ఆపరేషన్ చేయించుకున్నారని.. అలాగే సెక్రటరీ జనరల్ మారారని తెలిపారు. దీనివల్ల జాప్యం జరుగుతోందని.. మిగిలిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకునేందుకు మరి కొంత సమయం ఇవ్వాలని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని తెలిపింది. స్పీకర్‌కు చివరి అవకాశం ఇస్తున్నామని.. రెండు వారాల్లో మిగతా ఎమ్మెల్యేలపై కూడా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత వేటుపై తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో అఫిడవిట్ ఇవ్వాలని సూచించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.





# బేస్మెంట్‌లోనే పగుళ్లు

- నూతన గ్రామ పంచాయతీ, అంగన్వాడీ భవనం నిర్మాణంలో నాణ్యతా లోపం
- బేస్మెంట్‌లో పగుళ్లు కనిపించడంతో ప్రజల్లో ఆందోళన

**జనోదయ,జగిత్యాల, జనవరి 16**

జగిత్యాల జిల్లా జగిత్యాల మండలంలోని బాలపెల్లిలో ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న నూతన గ్రామ పంచాయతీ ప్రధాన భవనం, అంగన్వాడీ నిర్మాణంలో నాణ్యత లోపాల కారణంగా బేస్మెంట్‌లో పగుళ్లు కనిపించడం, స్థానిక ప్రజల ఆందోళనను పెంచుతోంది. ప్రస్తుతం భవనం నిర్మాణ దశలోనే బేస్మెంట్ గోడల్లో పెద్ద పెద్ద పగుళ్లు కనిపించటం, సైటు పనుల నాణ్యతపై తీవ్ర ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. భవనం నిర్మాణాన్ని పరిశీలించిన గ్రామస్తులు, మిశ్రమ సమతుల్యానికి సంబంధించి సరైన నిఘాపణలు లేకపోవడంతోనే పగుళ్లు ఏర్పడుతున్నాయని తెలిపాయి.పంచాయతీ స్థాయి అధికారులతోపాటు సాంకేతిక ఇంజనీర్స్ కూడా ఈ కార్యక్రమానికి బాధ్యత వహిస్తున్నారు. అయితే, పనుల పర్యవేక్షణలో తగిన శ్రద్ధ లేదని గ్రామవాసులు ఆరోపిస్తున్నారు. బేస్మెంట్ నిర్మాణంలో ఉపయోగిస్తున్న సిమెంట్–ఇసుక మిశ్రమం ప్రమాణాలకు తగ్గట్టుగా లేదనీ, ఇనుము రాడ్ల కవరేజీ తగినంతగా లేకపోవడం వల్ల భవనం భద్రతకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడవచ్చనీ అక్కడి ప్రజలు చెబుతున్నారు.గ్రామ పంచాయతీ వర్కింగ్ కమిటీ సభ్యులు, అధికారులకు పగుళ్ల ఫొటోలు, నివేదికలు సమర్పిస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. "ప్రభుత్వ నిధులతో సేవ కోసం నిర్మిస్తున్న భవనం ఈ దశలోనే సమస్యలు చూపిస్తే భవిష్యత్తులో ప్రమాదాలు తప్పవు" అని స్థానికులు అంటున్నారు. ఈ సమస్య సంబంధిత ఇంజనీర్ ప్రాంతీయ కార్యాలయం వెంటనే దృష్టిలోకి తీసుకుని స్థల పరిశీలన చేపట్టాలని గ్రా



మ పంచాయతీ అభ్యర్థించింది. సాంకేతిక నిపుణులతో నాణ్యత పరీక్షలు నిర్వహించి, అవసరమైతే పూర్వపు నిర్మాణ మార్గాలు మార్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ప్రజలు, అధికారుల సమన్వయంతో భవనం బలంగా, నాణ్యంగా నిర్మింపబడాలని అంటున్నారు.

# మోడల్ స్కూల్ ప్రవేశాల షెడ్యూల్ విడుదల



**జనోదయ : మందమర్రి జనవరి 16 :**

తెలంగాణ మోడల్ స్కూల్లో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రవేశాల కోసం పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. మోడల్ స్కూల్ లో ప్రవేశాలు పొందు వారు ఈనెల 28 నుండి ఫిబ్రవరి 28 వరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దరఖాస్తుదారులకు ఏప్రిల్ 9 నుండి హాల్ టికెట్లను ఆన్ లైన్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవాలని, ఏప్రిల్ 19న ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపింది. ఆరో తరగతి ప్రవేశాల కోసం ఏప్రిల్ 19న ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, ఏడవ తరగతి నుండి పదవ తరగతి ప్రవేశాలు పొందే వారు ఏప్రిల్ 19న మధ్యాహ్నం 2 గంటల నుండి నాలుగు గంటల వరకు ప్రవేశ పరీక్షలు నిర్వహించ నున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కోరింది.

# పోలీసులను ఆశ్రయించిన అనసూయ



**హైదరాబాద్, జనవరి16 :**

ప్రముఖ నటి, టీవీ యాంకర్ అనసూయ భరద్వాజ్ సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడం సినీ, సోషల్ మీడియా వర్గాల్లో సంచలనంగా మారింది. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న ట్రోలింగ్, వ్యక్తిత్వ హననం, అభ్యంతరకర పోస్టులు చేస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. తన పరువుకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నారంటూ ఆమె ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. గతేడాది డిసెంబర్ 23వ తేదీ నుంచి తనపై ఆన్‌లైన్ వేధింపులు పెరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.నిందితుల పేర్లతో పాటు సోషల్ మీడియా లింకులు ఫిర్యాదుతో జత చేశారు అనసూయ. సోషల్ మీడియాలో తనపై క్యాంపెయిన్ తరహాలో దాడి జరిగిందని చెప్పుకొచ్చారు. ఓ ఇంటర్వ్యూలో తన అభిప్రాయం చెప్పిన తర్వాతే ఈ వేధింపులు మొదలయ్యాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అశ్లీల వ్యాఖ్యలు, లైంగిక దూషణలు, బెదిరింపులు జరిగాయని ఫిర్యాదులో వెల్లడించారు. క్రిమినల్ డెఫమేషన్, వ్యక్తిగత వేధింపులు, ఏఐ ఫోర్జరీ వంటి నేరాలు జరిగాయని ఫిర్యాదు చేశారు. అనసూయ ఫిర్యాదుతో మొత్తం 42 మందిపై కేసు నమోదైంది. కొందరు వ్యక్తులు, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఖాతాదారులపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసులు నమోదు చేశారు.సీనియర్ నటి కరాటే కల్యాణి, ప్రముఖ రేడియో జాకీ శేఖర్ బాషా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్ బొజ్జ సంధ్యారెడ్డి, ప్రియాచౌదరి గోగినేని, పావని, రజిని, నటి విజయలక్ష్మి, ఒక ప్రముఖ ఛానల్ యాంకర్ రోహిత్, మరికొందరు యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులు, యాంకర్లు ఉన్నారు. వీరు వివిధ సోషల్ మీడియాల వేదికగా విమర్శలు చేశారని అనసూయ ఫిర్యాదు చేశారు.

# మురిసిన వంగర..పులకించిన భక్తజనం

- వంగరలో భక్తిప్రపత్తుల 'రథ' చక్రం
- శతాబ్ది వేడుకగా వీరభద్ర యాత్ర
- పీవీ ప్రభాకర్ రావు నేతృత్వంలో వైభవంగా ఉత్సవం

**జనోదయ : వంగర**



ఆధ్యాత్మికతకు అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే వంగర వీరభద్ర స్వామి రథ యాత్ర బుధవారం జనసంద్రాన్ని తలపించింది.భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు పూర్వీకుల కాలం నుండి వస్తున్న ఈ సంప్రదాయం, భక్తికి వారసత్వానికి వారధిగా నిలిచింది. పీవీ కుమారుడు పీవీ ప్రభాకర్ రావు, పీవీ శరత్ బాబు, పీవీ మదన్ మోహన్, తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు తనుగుల జితేందర్ రావు తదితర కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ యాత్ర అత్యంత వైభవంగాసాగింది. ఈ రథయాత్ర కేవలం ఒక వేడుక కాదు, మా కుటుంబానికి దైవానికి ఉన్న అనుబంధం. మా నాయనమ్మ రత్నమ్మ పురుష సంతానం కోసం వీరభద్ర స్వామికి మొక్కుకుని, నాన్నని (పీవీ నరసింహారావు) దత్తత తీసుకోవడం వల్లే ఈ వంశం నేడు ఇలా ఉందనేది మా ప్రగాఢ విశ్వాసం. ఆ కృతజ్ఞతతోనే 1925 ప్రాంతంలో ప్రారంభమైన ఈ సంప్రదాయాన్ని నాన్న తన చివరి శ్వాస వరకు గౌరవించారు.ఆయన దేశ ప్రధానిగా ఉన్నా సరే, వంగర రథయాత్ర విశేషాలను అడిగి తెలుసుకునేవారు. ఇప్పుడు ఆ పవిత్ర బాధ్యతను మోసే అవకాశం మాకు దక్కడం పూర్వజన్మ సుకృతం అని పీవీ ప్రభాకర్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 2,000 మంది భక్తులు పాల్గొన్నారు. పీవీ గ్లోబల్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో స్థానిక ప్రముఖులు మొండయ్య, వెంకట్ రెడ్డి, సతీష్ రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.వందేళ్ల నాటి ఈ చరిత్రను నేటి తరం యువతకు పరిచయం చేస్తూ, వంగర గ్రామ ఐక్యతను చాటిచెప్పడమే ఈ రథయాత్ర ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

# గాదె ఇన్నయ్యకు 48 గంటల బెయిల్



**జనగామ, జనవరి 16:** యూపీఏ చట్టం కింద ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేసిన సామాజిక కార్యకర్త గాదె ఇన్నయ్యకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం ఆయనకు షరతులతో కూడిన 48 గంటల తాత్కాలిక బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది.గాదె ఇన్నయ్య తల్లి థెరిసమ్మ (93) గురువారం రాత్రి మరణించారు.ఈ నేపథ్యంలో ఆయనకు కోర్టు ఈ బెయిల్ మంజూరు చేసింది. శనివారం జనగామ జిల్లాలోని జాఫర్‌గఢ్ మండలం సాగరంలో ఆయన తల్లి అంత్యక్రియలు జరగనున్నాయి. అందులో గాదె ఇన్నయ్య పాల్గొనున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో వరుసగా ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత కాటా రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ మరణించారు. ఆయన అంత్యక్రియలకు మావోయిస్టు మాజీ నేత గాదె ఇన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మావోయిస్టులకు అనుకూలంగా ఆయన వ్యాఖ్యలు చేయడం ద్వారా ప్రజలను.. ప్రేరేపించారే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఉపాచట్టం కింద ఆయనపై ఎన్ఐఏ కేసు నమోదు చేసింది. ఆ క్రమంలో డిసెంబర్ 21న ఇన్నయ్యను ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ప్రస్తుతం ఆయన అక్కడే ఉన్నారు.

# కాల్వ శ్రీరాంపూర్‌లో ఘనంగా పెద్దమ్మ బోనాల ఉత్సవాలు

## వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్

**జనోదయ,పెద్దపల్లి ప్రతినిది జనవరి 16:** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలో పెద్దమ్మ బోనాల ఉత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ముదిరాజ్ కుల సంఘం ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి జాతర సందర్భంగా మండల కేంద్రం భక్తిశ్రద్ధలతో ఉప్పొంగింది. ఎక్కడ చూసినా పసుపు-కుంకుమల వాసన, డప్పుల మోగులు, అమ్మవారి నామస్మరణలతో గ్రామమంతా ఒక ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.

ముదిరాజ్ కులస్తుల ఆహ్వానం మేరకు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ ఉత్సవాలలో పాల్గొని పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ముదిరాజ్ కులస్తులు సహా మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో విరాజిల్లాలని పెద్దమ్మ తల్లిని వేడుకున్నారు. ప్రజల శ్రేయస్సే పరమావధిగా భావించే ఈ ప్రార్థనలో, గ్రామీణ జీవనంలోని సానుకూల ఆశలు ప్రతిఫలించాయి.

బోనాల ఉత్సవం అంటే కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు——అది ప్రజల నమ్మకం, తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం. పెద్దమ్మ తల్లి కరుణతో గ్రామం కష్టాల నుంచి బయటపడుతుందని, పంటలు పుష్కలంగా పండుతాయని, కుటుంబాల్లో శాంతి నెలకొంటుందని ప్రజల అచంచల విశ్వాసం. అందుకే మహిళలు సంప్రదాయ వేషధారణలో బోనాలు మోసుకుంటూ, భక్తి పరవశంతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించడం ఈ ఉత్సవానికి ప్రత్యేక శోభను తెచ్చింది.

ఈ సందర్భంగా ముదిరాజ్ కుల సంఘం, అంజనీపుత్ర మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి ఆధ్వర్యంలో అక్కడికి వచ్చిన ప్రజాప్రతినిధులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఇది కేవలం మర్యాదపూర్వక కార్యక్రమం మాత్రమే కాకుండా——సామాజిక సమన్వయానికి, పరస్పర గౌరవానికి నిదర్శనంగా నిలిచింది. ప్రజా ప్రతినిధులు కూడా గ్రామాభివృద్ధికి తమవంతు కృషి కొనసాగిస్తామని హామీ ఇవ్వడం గమనార్హం.

ఈ కార్యక్రమంలో కాల్వ శ్రీరాంపూర్ సర్పంచ్ బంగారి రమేష్, ఉపసర్పంచ్ గోలి సుధాకర్, వార్డు మెంబర్లు, ఇప్పలపల్లి సర్పంచ్ జిన్న రామచందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మాదాసి సతీష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శివరామకృష్ణ, మాజీ ఎంపిటిసి పొట్యాల మొండయ్య, ఏఎంసి డైరెక్టర్ రామచంద్రం, ఓదెల ధర్మకర్త కొండ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు, అంజనీపుత్ర మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి తదితరులు పాల్గొని ఉత్సవాలకు మరింత శోభను



చేకూర్చారు. ముదిరాజ్ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి సేవలో భాగమయ్యారు.

మొత్తానికి, పెద్దమ్మ బోనాల ఉత్సవాలు భక్తి-సంప్రదాయం-సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి. ఆధునిక కాలంలోనూ గ్రామీణ సంస్కృతిని, దేవీ ఆరాధన తత్వాన్ని సజీవంగా నిలుపుతున్న ఇలాంటి పండుగలు——ప్రజల మనసుల్లో నమ్మకాన్ని మరింత బలపరుస్తాయి. పెద్దమ్మ తల్లి కటాక్షం ప్రతి ఇంటా సుఖశాంతులు నింపాలని కోరుకుంటూ, ఈ ఉత్సవం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచింది.



# గంగాధర: కోట్ల నర్సింహుల పల్లిలో ఘనంగా శ్రీ వీరభద్ర స్వామి రథోత్సవం

**జనోదయ – గంగాధర | జనవరి 16:** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కోట్ల గ్రామంలోని నందగిరి కొట్ల శ్రీ వీరభద్ర స్వామి వారి ఆలయంలో నిర్వహించిన శ్రీ వీరభద్ర స్వామి రథోత్సవం భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ రథోత్సవం భక్తులకు కనుల పండుగగా నిలిచింది.


ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను రకరకాల పూలతో సుందరంగా అలంకరించిన రథంపై ఆశీనుల్ని చేశారు. వేదమంత్రోచ్చారణలు, డప్పుచప్పులు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామ వీధుల గుండా రథాన్ని ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వామివారిని ఆహ్వానించగా, భక్తులు "హర హర వీరభద్ర" నామస్మరణతో భక్తివాతావరణాన్ని నెలకొల్పారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్త జనం

రథోత్సవానికి కోట్ల గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు సకుటుంబ సపరివారంగా వచ్చి స్వామివారి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనేక మంది భక్తులు స్వామివారి అనుగ్రహం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులందరికీ బోజన ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు ప్రశాంతంగా అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు.





# పెద్దపల్లి జిల్లాలో మొదలైన సమ్మక్క–సారక్క సందడి...

**కోరికలు తీర్చిన అమ్మలకు నిలువెత్తు బంగారం (బెల్లం)తో మొక్కులు**

**జనోదయ,పెద్దపల్లి ప్రతినిధి జనవరి 16:** పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం పరవళ్లు తొక్కుతోంది. అడవితల్లి సమ్మక్క, వీరనారి సారక్కల మహిమను చాటే జాతర సమయం సమీపించడంతో భక్తుల హృదయాల్లో భక్తి తరంగాలు ఉప్పొంగుతున్నాయి. గ్రామగ్రామాన వినిపిస్తున్న అమ్మవార్ల నామస్మరణ, ఆలయాల్లో వెలుగుతున్న దీపశిఖలు——ఇవన్నీ కలిసి జిల్లా మొత్తాన్ని ఒక దైవ ధామంలా మార్చాయి.

ప్రత్యేకించి, భక్తులు కోరుకున్న కోరికలు నెరవేరిన ఆనందంతో అమ్మవార్లకు కృతజ్ఞతగా నిలువెత్తు బంగారం అంటే బెల్లాన్ని కొలుస్తూ మొక్కులు చెల్లించడం ఇక్కడి విశిష్ట సంప్రదాయం. ఇది కేవలం ఒక ఆచారం కాదు; దైవంపై ఉన్న అచంచల విశ్వాసానికి, అమ్మల కరుణపై ఉన్న నమ్మకానికి ప్రతీక. చిన్నారుల ఆరోగ్యం నుంచి పంటల పుష్కలత వరకూ, ఉపాధి నుంచి కుటుంబ సుఖశాంతుల వరకూ——ఎన్ని కోరికలైతే, అంతే సంఖ్యలో మొక్కులు. అమ్మలు





దయ చూపారని నమ్మిన ప్రతి భక్తుడి చేతుల్లో బెల్లం తులాభారంగా మారుతోంది. గ్రామ దేవతల ఆలయాల్లో ముందుగా మొక్కులు చెల్లించి, ఆ తర్వాత భక్తులు వేలాదిగా మేడారంకు పయనమవుతున్నారు. అడవుల మధ్య వెలసిన ఆ పవిత్ర క్షేత్రానికి చేరుకోవడమే ఒక యాత్ర, ఒక అనుభవం. కొండబాటలు, అరణ్య మార్గాలు దాటుతూ వెళ్లే ప్రతి అడుగు——అమ్మలపై ఉన్న భక్తికి నిదర్శనం. "జై సమ్మక్క... జై సారక్క" అన్న నినాదాలతో మారుమోగుతున్న దారులు, భక్తుల మనసుల్లోని విశ్వాసాన్ని మరింత బలపరుస్తున్నాయి. సమ్మక్క-సారక్క జాతర గొప్పతనం ఏమిటంటే——ఇక్కడ భక్తి ఆర్భాటంగా కాకుండా ఆత్మీయంగా వ్యక్తమవుతుంది. కులం, మతం, వర్గం అనే భేదాలు ఇక్కడ కరిగిపోతాయి. అందరూ అమ్మల బిడ్డలే. ఒకే వరుసలో నిలబడి, ఒకే నమ్మకంతో మొక్కులు చెల్లించడం చూస్తే——మన సంస్కృతిలోని సమానత్వ భావన ఎంత గొప్పదో అర్థమవుతుంది. గిరిజన సంప్రదాయాల్లో పుట్టిన ఈ పూజా విధానం, నేటికీ తన మూల స్వరూపాన్ని కాపాడుకుంటూ తరతరాలుగా సాగుతుండడం విశేషం. జిల్లా యంత్రాంగం కూడా భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. రవాణా, తాగునీరు, వైద్య సేవలు, భద్రత——అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు అన్నదానం, సేవాకార్యక్రమాలతో ముందుకొచ్చి అమ్మల సేవలో భాగమవుతున్నాయి. ఇది ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా——ప్రజలందరి భాగస్వామ్యంతో సాగే మహోత్సవంగా నిలుస్తోంది. సమ్మక్క-సారక్క అంటే కేవలం దేవతల పేర్లు కాదు——అవి ప్రజల నమ్మకం, వారి జీవన తత్వం. కష్టాల్లో అమ్మలను తలుచుకోవడం, సుఖాల్లో కృతజ్ఞతగా మొక్కులు చెల్లించడం——ఇదే ఈ జాతర ఆత్మ. పెద్దపల్లి జిల్లాలో మొదలైన ఈ సందడి, మేడారం దాకా సాగుతూ, భక్తుల హృదయాల్లో దైవానుభూతిని నింపుతోంది. నిలువెత్తు బంగారం (బెల్లం) కొలుస్తూ చెల్లిస్తున్న ప్రతి మొక్కులో——అమ్మలపై ఉన్న అపార విశ్వాసం ప్రతిఫలిస్తోంది.

# వేములవాడ ఆలయ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

## -మంత్రి సీతక్క

**జనోదయ – వేములవాడ, జనవరి 16:**

వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారని మంత్రి సీతక్క తెలిపారు. రాజన్నకు అనుబంధంగా ఉన్న భీమేశ్వర ఆలయంలో మంత్రి సీతక్క శుక్రవారం కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. వేములవాడకు వచ్చే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధి కేవలం మౌలిక వసతులకే పరిమితం కాకుండా, భక్తుల భావోద్వేగాలు, సంప్రదాయాలు, ఆచారాలతో ముడిపడి ఉంటుందని మంత్రి సీతక్క అన్నారు.

ఈ నెల 18వ తేదీన మేడారంలో క్యాబినెట్ భేటీ నిర్వహించనున్నట్లు తెలిపారు. 19వ తేదీన మేడారం ఆలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునఃప్రారంభిస్తారని వెల్లడించారు. పుష్కరాల దృష్ట్యా గోదావరి పరివాహక ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధితో పాటు భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి సీతక్క తెలిపారు.

